

ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కామర్స్ అధ్యాపకుడు సుదర్శన్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో విద్యార్థినీలతో అసభ్యకరంగా మాట్లాడిన విషయంపై ఆయనను సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపల్ బాబు తెలిపారు. ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు అమృత్ తేజ్, నరేష్ కుమార్, ఉత్తన్న, గంగిరాజు తదితరులు బుధవారం ఉదయం ప్రిన్సిపల్ బాబును కలిసి కామర్స్ అధ్యాపకుడు సుదర్శన్‌ను సస్పెండ్ చేయాలని వినతిపత్రం అందించారు.



ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎపిఎండిసి స్కూల్ సబ్ స్టాఫ్ రిలే నిరాహార దీక్షలు భగ్నం

- పోలీసుల తీరును తీవ్రంగా ఖండించిన సిఐటియు, సిపిఎం
- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె(పుల్లంపేట)

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో సబ్ స్టాఫ్‌ను తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను బుధవారం పోలీసులు భగ్నం చేశారు. జనవరి 27వ తేదీ నుంచి స్కూల్ గేట్ ముందు శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం చేయకుండా పోలీసులు బలవంతంగా శిబిరాన్ని తొలగించారు. సబ్ స్టాఫ్‌ను జీపుల్లోకి ఎక్కించి అక్రమంగా అరెస్టు చేశారు. అక్కడి నుంచి పోలీసుస్టేషన్‌కు వారిని తరలించారు. తర్వాత పూచీకత్తుపై విడుదల చేశారు. దీక్షలను భగ్నం చేయడం పట్ల సిఐటియు, సిపిఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పబ్లిక్ స్కూల్‌లో పనిచేస్తున్న సబ్ స్టాఫ్, హౌస్ కీపింగ్, స్కావెంజర్స్ 10 మందిని మూడేళ్ల నుంచి పనిచేయించుకుంటూ కొత్త కాంట్రాక్టర్ వచ్చి ఆరు నెలలు పనిచేయించుకొని మూడు నెలల జీతం ఇవ్వకుండా అడిగినందుకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మీరు అవసరం లేదని పాతవారితో పని చేయించుకుంటామని అక్రమంగా తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సబ్ స్టాఫ్‌ను అరెస్టు చేయడాన్ని సిఐటియు తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ అక్రమ పద్ధతులు టెండర్ లేకుండా లోపాయికారి ఒప్పందం నామినేటెడ్ ద్వారా నమ్స్ ప్రకారం పని చేయకుండా పాఠశాల నడుపుతున్న వారిని గతంలో కార్మికులు పిఎఫ్, ఇఎస్ఐ డబ్బులు కట్టకుండా స్వాహా చేసిన అతనికి ఎలా కాంట్రాక్ట్ ఇచ్చారని ప్రశ్నించారు. మూడు నెలల జీతం ఎగ్గొట్టి పిఎఫ్ కట్టకుండా కార్మికులను మోసం చేసిన కాంట్రాక్టర్ పైన కేసు పెట్టకుండా పోలీసులు న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా దీక్షలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్, సిపిఒ సుదర్శన్‌రెడ్డి కాంట్రాక్టర్ మహేష్ ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ మాకు సంబంధం లేదని కార్మికులను రోడ్డున పడేసారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల నుండి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఇంటి చుట్టూ తిరిగారని తెలిపారు. ఆయన, ఎమ్మెల్యే సబ్ స్టాఫ్‌ను డ్యూటీలోకి తీసుకోవాలని మేనేజ్మెంట్ సిపిఒ, కాంట్రాక్టర్‌కు లెటర్ ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ జీతం ఇవ్వకపోయినా తాను జీతం ఇస్తానని రూపానంద్‌రెడ్డి హామీ ఇచ్చినా అమలు చేయకుండా కార్మికులు పండుగలకు పస్తులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరూ కూడా పునరావాస బాధితులైన దళితులు, బిసిలేనని పేర్కొన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే నిరాహార దీక్షలో చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రూరల్ సిఐ వెంకటేశ్వర్లు సోమవారం కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని కార్మికులకు, నాయకులకు మాటిచ్చారని న్యాయం జరగకుంటే సోమవారం తర్వాత నిరవధిక నిరాహార దీక్షలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా వారికి న్యాయం చేయాలని లేకుంటే ఈ ఉద్యమాన్ని దశలవారీగా అందరిని కలుపుకొని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.జాన్ ప్రసాద్, బాధితులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె : సబ్ స్టాఫ్‌ను జీపు ఎక్కిస్తున్న పోలీసులు

స్వీపర్ల తొలగింపు ప్రభుత్వ పతనానికి నాంది : సిఐటియు

రాయచోటి టౌన్ : ఎపిఎండిసి స్కూల్లో మూడు సంవత్సరాల నుండి చేస్తున్న స్వీపర్లను తొలగించి కడుపు కొడుతున్న కూటమి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాత రాయచోటి సచివాలయం ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఎపిఎండిసి పారిశుధ్య కార్మికులకు మద్దతుగా పరకలు, గంపలు చేత బట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎండిసి యాజమాన్యం మూడు సంవత్సరాల నుండి పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను తొలగించారాని, మూడు నెలలు జీతం ఇవ్వకుండా వేధించడం తగదన్నారు. కాంట్రాక్టర్ మహేష్‌కు టెండర్ లేదని అటువంటి వారిని కూటమి ప్రభుత్వం మద్దతుగాఉందని పిల్లల మల మూత్రాలు శుభ్రపరిచి కడుపు నింపుకుంటున్న వారి కడుపు కొట్టడమేగాక పని కలిపించాలని 7 రోజులుగా శాంతియుత రిలే దీక్షలను చేపట్టారని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాలిస్తామని నేడు పోలీసుల చేత మహిళలు అని చూడకుండా అరెస్టు చేయించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పతనం ఎపిఎండిసి స్కూల్ స్వీపర్ల తొలగింపు నాంది కానున్నదని తెలిపారు. వారికి అండగా సిఐటియు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం : సిపిఎం

రాయచోటి టౌన్ : ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ చేస్తున్న దీక్షలను పోలీసులు భగ్నం చేసి అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఖండించారు. 17 రోజులుగా పోరాటం చేస్తున్న కార్మికులపై పోలీసులు ప్రవర్తించిన తీరు అభ్యంతరమన్నారు. కార్మికుల సమస్యలు చర్చలతో పరిష్కరించాలి తప్ప నిర్బంధాన్ని ప్రయోగించి అణచివేయడం నియంతృత్వ చర్యన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు పోలీసులతో అక్రమ అరెస్టులు నిర్బంధాలు ఉండవంటూ గొప్పగా చెప్పి అధికారం చేపట్టిన తర్వాత అక్రమ అరెస్టులు నిర్బంధాలు చేస్తున్నారన్నారు. ప్రజలను అణచివేయడం, ప్రజల మీద నిర్బంధాన్ని ప్రయోగించడం పట్ల స్పందించాలని డిమాండ్ చేశారు. వెంటనే మంగంపేట పబ్లిక్ స్కూల్ సంఘటనలో జోక్యం చేసుకొని అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లో చేర్చుకోవాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కార్మికుల తరపున పోరాడుతామని హెచ్చరించారు.

రాజంపేట అర్బన్ : మంగంపేట ఎపిఎండిసి పాఠశాలలో పని చేస్తున్న సబ్ స్టాఫ్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. బుధవారం పాత బస్టాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్కూల్లో హౌస్ కీపింగ్ స్కావెంజర్స్‌గా పనిచేస్తున్న వారికి మూడు నెలలు జీతాలు అడిగినందుకు విధుల్లో నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే మంగంపేట యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ ఎటువంటి చర్చలు జరపకుండా కనీసం మహిళలని చూడకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. యజమాన్యం స్పందించకపోతే ఉద్యమం కొనసాగిస్తామని, తక్షణమే యాజమాన్యం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాయచోటి : నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాణ్యతే ప్రామాణికంగా పిజిఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మదనపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు మండలంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో భాగంగా భూ సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై తహశీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఎలతో సమీక్షించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూమి సమస్యలపై సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్లో ఉన్నవి ఎన్ని అని తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో పిజిఆర్ఎస్‌లో 11వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 5వేల దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో బాగా వెనకబడిన మండలాలలో మదనపల్లి కూడా ఒకటన్నారు. మదనపల్లి మండలంలో సర్వేతో కలిపి 1361 దరఖాస్తులు వచ్చాయని కేవలం 285 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించారన్నారు. బాగా పనిచేసిన వారిని లక్ష్యంలో వెనుకబడిన ప్రాంతాలకు పంపి అక్కడ కూడా ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. దరఖాస్తులు పరిష్కారాన్ని నామమాత్రంగా చేయకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేసి అత్యంత నాణ్యతతో వేగంగా పరిష్కరించడమే ధ్యేయం కావాలన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు వాటికి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహశీల్దార్ ధనుంజయులు, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట : భూమి సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హత మేరకు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవిన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారం ప్రగతిపై సమీక్షించారు. భూమి సమస్యలపై సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్లో ఉన్నవి ఎన్ని అని తహశీల్దార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా మండలంలో భూమి సమస్యలపై 541 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 281 పరిష్కరించామని, ఇంకను 260 పెండింగ్ ఉన్నట్లు తహశీల్దార్ తపస్విని కలెక్టరుకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు. ఇంకను పెండింగ్ ఉన్న వాటిని అంశం వారీగా ఎస్ఎల్ఏ పరిధిలోగా పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీలలో మ్యూటేషన్స్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూసేకరణ, దారి సమస్యలు, ఫౌతి కేసులు, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, డిస్ప్యూట్స్, సివిల్ కేసులు తదితరాలను సమీక్షించి తీసుకోవల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయికి వెళ్తే భూసేకరణ, దారి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. 3 రోజుల్లో దారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరగాలి. అర్జీల పరిష్కారంలో నాణ్యత, వేగం రెండూ ముఖ్యం. పరిష్కరించలేని అర్జీలకు వాస్తవ కారణాలతో స్పష్టమైన నివేదిక రూపొందించి అర్జీలను పరిష్కరించాలని చెప్పారు. మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు వాటికి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.



కురబలకోట : మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

23 నుంచి శ్రీవీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు : డిఆర్ఓ



మాట్లాడుతున్న డిఆర్ఓ మధుసూదనరావు

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 5 వరకు జరగబోయే శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా దేవాదాయ శాఖ, పోలీసుల, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, మున్సిపల్, ప్రజారవాణా, రహదారులు, ఎక్సైజ్, విద్యాశాఖ, తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాకు తలమానికమైన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సుమారు రెండు లక్షల మంది యాత్రికులు రానున్న నేపథ్యంలో ఉచిత దర్శనం, వసతి గదుల ఏర్పాటు, అన్నదానం, తాగునీటి వసతి, తదితర అంశాలలో ఆలయ ఇఓ, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సజావుగా జరగడానికి కీలకపాత్ర పోషించనున్న పోలీసు శాఖ వారు కట్టుదిట్టమైన క్యూలైన్లను ఏర్పాటు చేసి పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారిని ఆదేశించారు. పోలీస్ శాఖ, రహదారులు, భవనాల శాఖ, విద్యుత్ శాఖలు సమన్వయంతో రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వేడుకల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ఉండరాదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, వీరభద్ర స్వామి ఆలయ ఇఓ రమణారెడ్డి జిల్లా, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తాసిల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా శాఖ, రహదారులు, భవనాల శాఖ, ఎక్సైజ్ శాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.



టిడిపి కేంద్ర కార్యాలయంలో షాజహాన్‌బాషా, చినబాబు

ఎమ్మెల్యే, చినబాబు మధ్య కుదిరిన సయోధ్య..?

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె తెలుగుదేశం పార్టీలో మూడు రోజులుగా నెలకొన్న గ్రూపు విభేదాలకు సయోధ్య కుదిరినట్లుగా తెలుస్తోంది. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబుల మధ్య మూడు రోజులుగా విభేదాలు భగ్గుమన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఒకానొక దశలో దాడులకు తెగపడేందుకు కూడా సిద్ధపడ్డారు. అధిష్టానం ఇరువురిని మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయానికి పిలిపించుకుంది. ఈ క్రమంలో బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయానికి చేరిన షాజహాన్ బాషా, చినబాబుల మధ్య రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, జోన్-4 ఇన్‌ఛార్జి దీపక్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, మదనపల్లె పరిశీలకులు గాజుల శివరాం ప్రతాప్ ఆధ్వర్యంలో మదనపల్లి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఇద్దరి నాయకులను సమన్వయ పరిచి రాజీ కుదిర్చినట్లు తెలుస్తోంది. మదనపల్లె టిడిపిలో వర్గ విభేదాలకు ఫుల్‌స్టాప్ పడినట్లేనని తెలుస్తోంది.

వరుస ఆత్మహత్యలపై విచారించాలి

ప్రజాశక్తి - రాయచోటి

రాజంపేట బోయినపల్లిలో అన్నమాచార్య ప్రయివేట్ యూనివర్సిటీలో జరుగుతున్న వరుస ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. రాజశేఖర్, ఎం.వినోద్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిమిది నెలల కాలంలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం యాజమాన్యం బాధ్యత వహించాలని అన్నారు. ధనర్జనే ధ్యేయంగా పైరవీలతో ఇంజినీరింగ్ స్థాయి కళాశాలను యూనివర్సిటీగా మార్చుకున్నారని చెప్పారు. దీని ద్వారా స్వయంప్రతిపత్తితో తామే ఇష్టారాజ్యంగా అడ్మిషన్స్ చేసుకోవడం, ఫీజులు నిర్ణయించుకోవడం, పరీక్షలు నిర్వహించుకోవడం చేస్తూ కోట్ల రూపాయలు టర్నవర్ చేసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులను పట్టించుకోవడం ఎప్పుడో మరిచి పోయారన్నారు. అందుకే విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మ హత్యలు చేసుకుంటున్నారన్నారు. నిరంతరం కళాశాల్లో విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయని, త్మనున్యత భావనకు గురై విద్యార్థుల ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి ఎస్.జాకీర్, జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగేశ్వర పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ఆర్ఐఒ విఫలం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహా



సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డబ్బు కొట్టు.. మార్కులు పట్టు అంటూ ప్రాక్టికల్ పరీక్షల్లో మార్కుల పేరుతో విద్యార్థులను కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు నిలువు దోపిడి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ నరసింహ సర్వేపల్లి ఆరోపించారు. ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో ఆర్ఐఒ కృష్ణప్ప తీవ్రంగా విఫలం చెందారని, వెంటనే ఆర్ఐఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లె పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహ మాట్లాడుతూ ప్రాక్టికల్ పరీక్షలో పాస్ చేయాలంటే డబ్బు కట్టాల్సిందేనని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రయివేటు కళాశాలలు పీడిస్తున్నాయని విమర్శించారు. ఓ పక్క కరువు విలయ తాండవం చేస్తుంటే మరో పక్క కళాశాలల యాజమాన్యాలు మాత్రం విద్యార్థుల వద్ద నిస్సిగ్గుగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో కాకుండా స్థానిక కళాశాలలోనే నిర్వహించడంతో కళాశాల యాజమాన్యాలు ఇష్టమొచ్చినట్లుగా విద్యార్థులను పీడిస్తున్నారని పేర్కొన్నారు. డబ్బు ఇచ్చిన విద్యార్థులను ఒక విధంగా, ఇవ్వని వారిని ఇంకో విధంగా చూస్తూ చులకన భావంతో విద్యార్థుల మధ్య భేదాభిప్రాయాలను సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నింటిని ఆర్ఐఒ కృష్ణప్పకు సమాచారమిచ్చినా, నేనేమి చేయలేనని చేతులెత్తేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆరోపణల నేపథ్యంలో ఒక్క కళాశాల పైన కూడా విచారణ చేయలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్స్ ఇన్విజిలేషన్‌కు వెళ్లినప్పటికీ డబ్బు తీసుకొని చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారే తప్ప ప్రభుత్వ నిబంధనలు, ఇంటర్మీడియట్ బోర్డ్ ఆదేశాలను ఏమాత్రం అమలు చేయడం లేదని ఆరోపించారు. అన్నమయ్య జిల్లాలో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డబ్బులకు అమ్ముడుపోయారన్న వాదన తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందని పేర్కొన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా, విద్యార్థుల దగ్గర వసూలు చేసిన డబ్బులను వారిని తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్ఐఒగా విఫలమైన కృష్ణప్పను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, జస్వంత్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్రహం లింకన్ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహం లింకన్, జీవ పరిణామ పితామహుడు చార్లెస్ డార్విన్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బుధవారం అబ్రహం లింకన్, చార్లెస్ డార్విన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ ఇంగ్లాండ్‌కు చెందిన డార్విన్ భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయాలపై పరిశోధనలు చేసి జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడన్నారు. అమెరికా చరిత్రలో అత్యంత సంక్షోభ సమయంలో అబ్రహం లింకన్ అధ్యక్షుడిగా కొనసాగి చాలా సమస్యలు పరిష్కరించారన్నారు. రక్తపాతం, అంతర్యుద్ధం, నైతిక, రాజ్యాంగ పరమైన సంక్షోభ దశలో అబ్రహం లింకన్ ప్రదర్శించిన రాజనీతి, నాయకత్వం అమెరికాను నాగరిక దేశంగా ఆవిర్భవించడానికి కారణమైందన్నారు. అమెరికా ఫెడరల్ వ్యవస్థ ప్రత్యేకించి మన దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుందంటే దానికి కారణం లింకన్ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు బానిసత్వాన్ని నిర్మూలించిన ఘనత అబ్రహం లింకన్‌దేనన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు యుగంధర్, దామోదరం, సువర్ణదేవి, యోగరంజని, లక్ష్మీలలిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



అబ్రహం లింకన్, చార్లెస్ డార్విన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, విద్యార్థులు



రమేష్‌ను సన్మానిస్తున్న బాస్ నేతలు

సామాజిక సేవకుడు రమేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పివికె ఫౌండేషన్ చైర్మన్ మర్రిపాటి రమేష్ ఇటీవల సామాజిక సేవా విభాగంలో భారత్ వర్చువల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో డాక్టర్ మర్రిపాటి రమేష్‌ను, స్థానిక భారతీయ అంబేద్కర్ సేన (బాస్) కార్యాలయంలో వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. విశ్రాంత మండల విద్యాశాఖాధికారి ప్రజాకవి పోతబోలు రెడ్డప్ప, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దేవరింటి నరసింహులు, జర్నలిస్ట్ చామం చుల శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి పిటిఎం శివప్రసాద్ గౌరవ డాక్టరేట్ పొందిన మర్రిపాటి రమేష్‌ను శాలువలతో సత్కరించి, పూలమాల వేసి, జ్ఞాపికను బహు కరించి ఘనంగా సన్మానించారు. మర్రిపాటి రమేష్ రెండు దశాబ్దాలుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా తనను ఘనంగా సన్మానించిన బాస్ సంస్థ ప్రతినిధులకు రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, ఉద్యమ గాయకుడు సొన్నికంటి రెడ్డెప్ప, బాస్ టౌన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ పఠాన్, నాయకులు బైనేని సురేష్, తరుణ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


ప్రజాశక్తి-పీలేరు : పీలేరు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం అధ్యక్షులు వగళ్ళ చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న పెన్షనర్ల సంఘం కార్యాలయంలో తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్య బృందం ఈ వైద్య శిబిరం నిర్వహించిందన్నారు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న 100 మంది వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో ఉచిత శుక్లం ఆపరేషన్లకు ఎంప్లాయీస్ హెల్త్ కార్డ్ దారులు 7 మందిని, ఆరోగ్యశ్రీ కార్డ్ దారులు 9 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కొరకు ఎంపిక చేశారని అన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని వైద్య బృందం తిరుపతిలోని అమెరికన్ ఐ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యం బృందంతో పాటు పెన్షనర్ల సంఘం నాయకులు నరసింహారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్ల కోసం ఎంపికైన వారితో పెన్షనర్ల సంఘం నాయకులు

సక్రమంగా అందని ఆధార్ సేవలు

-అవస్థలు పడుతున్న సామాన్య ప్రజలు



5వ సచివాలయం



పట్టణ ప్రజలకు అనుకూలమైన 4వ సచివాలయం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని ఐదవ సచివాలయంలో ఆధార్ కేంద్రంలో ఆధార్ సేవలు సక్రమంగా అందక పోవడంతో సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ పలుకుబడి, పరపతి ఉన్న వారికి మాత్రమే పనులు చేసి సామన్య ప్రజలను రోజుల తరబడి తిప్పుకుంటూ చివరకు ఆధార్ కేంద్రం రద్దయిందని చెబుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలోని 4వ సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఊరికి చివరిలోని 5వ సచివాలయంలో ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నెట్‌వర్క్ సమస్య తలెత్తుందనే కారణంతో ఆపరేటర్ విధులు సక్రంగా నిర్వర్తించడం లేదని చెబుతున్నారు. నగర పంచాయతీ ప్రజలు ఆధార్ సర్ నేమ్ చేంజ్ కొరకు 11 కిలోమీటర్లు దూరంలో ఉన్న పిటిఎంకి వెళ్లవలసి వస్తోందని, అక్కడ ఏ ఒక్క సర్టిఫికెట్ అయినా ఒరిజినల్ కాకుండా జిరాక్స్ తీసుకువెళ్తే అధికారులు ఒరిజినల్ తీసుకురమ్మని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరల ఒరిజినల్ సర్టిఫికెట్ కొరకు బి.కొత్త కోటకు రావడం మరలా వెళ్లడం ఇలా చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 40వేల జనాభా ఉన్న పట్టణంలో ప్రజలకు అనుకూలంగా ఉన్న నాలుగో సచివాలయంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై నగర పంచాయతీ అకౌంట్స్ ఆఫీసర్ బి.రమాదేవిని వివరణ కోరగా ఆధార్ సెంటర్ ప్రభుత్వ నిబంధనలను మేరకు ప్రతిరోజూ నిర్వహించాలని, నిర్వాహకులు ఏదో ఒక సాకు చెప్పి పనులు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట ప్రతిరోజూ ఆధార్ సెంటర్ నిర్వహణ ఉంటుందని నోటీస్ బోర్డు ఏర్పాటు ఆమె తెలిపారు. ఇలాగే వ్యవహరిస్తే సచివాలయ అధికారిని పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పోలీసులకు సవాల్ విసురుతున్న కేబుల్ వైర్ దొంగలు

- 15 రోజులుగా రాత్రి వేళల్లో యథేచ్ఛగా చోరీలు
- రూ.9 లక్షలకుపైగా విలువైన కేబుల్ వైర్లు చోరీ
- లబోదిబోమంటున్న రైతులు



గండిమాలపల్లి వద్ద కేబుల్ వైర్లను దొంగలించిన దుండగులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లిలో గత కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు దొంగలిస్తూ పోలీసులకు ఒక రకంగా సవాళ్లు విసురుతున్నారు. నిమ్మనపల్లి, అగ్రహారం, తవళం, వెంగంవారిపల్లె గ్రామాలలో గడిచిన 15 రోజుల్లో సుమారు 80 వ్యవసాయ బోర్లు వద్ద రూ.9 లక్షలకు పైగా విలువైన కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించికెళ్లినట్లు సమాచారం. మంగళవారం రాత్రి మరో మారు నిమ్మనపల్లి, తవళం గ్రామం లోను, ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి వ్యవసాయ బోరు వద్ద రెండవసారి దొంగలించగా, ఆరిపిరెడ్డిగారిపల్లి తాగునీటి బోరు వద్ద సుమారు 80 మీటర్లు కేబుల్ వైర్లను దుండగులు దోచుకెళ్లారు. వేసవికాలంలో సాగు చేసిన వరి, టమోటా, ఇతర పంటలకు సకాలంలో నీరు అందించటానికి రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నాది. దొంగలించికెళ్లిన కేబుల్ వైరు స్థానంలో అప్పుచేసి మరలా కొత్త కేబుల్ వైరను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి బాధిత రైతులకు నెలకొన్నది. ఇప్పటికే పలుమార్లు బాధిత రైతులు పోలీసు స్టేషన్ ను ఆశ్రయించి, కేబుల్ వైర్ల చోరీ సంఘటనల పై ఫిర్యాదు చేశారు. రైతుల నుంచి ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా కేబుల్ వైర్ల చోరీ దారుల్లో ఏమాత్రం భయం లేకపోవడం, విచ్చలవిడిగా ప్రతిరోజు దొంగతనాలు చేస్తున్నడంతో పోలీసులకు ఒక రకంగా సవాళు విసురుతున్నట్లు అవుతోంది. రైతుల పడుతున్న బాధలను గమనించి, దొంగతనాలపై పోలీసులు వేగంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చోరీలకు పాల్పడుతున్నది ఎవరు.. దొంగలించకెళ్ళిన కేబుల్ వైర్లు ఎక్కడ అమ్ముతున్నారు.. అన్న వాటిపై నిఘా ఉంచాలని పేర్కొంటున్నారు. అవసరమైతే రైతులకు అవగాహన కల్పించి కేబుల్ వైరు చోరీ జరిగిన బోర్ల వద్ద నిందితుల వేలు ముద్రలను సాంకేతికత ద్వారా సేకరించాల్సిన పరిస్థితి నెలకొంది.వరుస చోరీలపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

పన్నులు సకాలంలో చెల్లించాలి : కమిషనర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలకు కమిషనర్ కె.ప్రమీల విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలో పన్నులు చెల్లింపులపై ఆర్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దుకాణదారులు,ప్రజలు ఇంటి పన్నులను యథావిధిగా చెల్లించాలని లేకుంటే జరిమానా విధిస్తామని అన్నారు. గత కొన్నేళ్లుగా బకాయిలు పడ్డవారు ఒకేసారి పన్ను చెల్లిస్తే రాయితీ ఇస్తామని తెలిపారు. ఇప్పటికే పన్ను చెల్లింపులపై పట్టణ ప్రజలకు పలుమార్లు అవగాహన కల్పించామని, దీనిని దృష్టిలో ఉంచుకొని పన్ను బకాయిలు ఉన్న దుకాణదారులు, ఇంటి యజమానులు సత్వరమే పన్నులు చెల్లించాలని కోరారు.



పన్ను వసూళ్లకు పట్టణంలో పర్యటిస్తున్న కమిషనర్ ప్రమీల

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన వెంకట్‌రెడ్డి సిద్ధార్థ విద్యార్థులు



జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులతో కరస్పాండెంట్ వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలోని వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో మెరిశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి అత్యంత మెరుగైన శాతంతో పట్టణంలోనే మొదటి ఐదు స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో వెంకట్ రెడ్డి సిద్ధార్థ కళాశాల ముందుంటుందని అన్నారు. అందుకు నిదర్శనమే జెఇఇ మెయిన్స్‌లో పట్టణంలోనే మొదటి ఐదు స్థానాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కళాశాలకు చెందిన తనుశ్రీ 93.88 శాతంతో పట్టణంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, దేదీప్య సాయి 93.66 శాతంతో రెండవ స్థానం, మిథున్ హరిహరన్ 88.83 శాతంతో మూడో స్థానం, మహమ్మద్ సోహైల్ 85.38 శాతం నాలుగవ స్థానం, మోక్షజ్ఞరెడ్డి 80.30 శాతంతో 5వ స్థానాన్ని కైవసం చేసుకొని విజయఢంకా మోగించారన్నారు. విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన చేసిన అధ్యాపకుల కృషిని ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

సత్తాచాటిన కృష్ణారెడ్డి కళాశాల విద్యార్థులు

జెఇఇ మెయిన్స్‌లో మదనపల్లికి చెందిన కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులు అదరగొట్టారు. ఆలిండియా ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు. ఈ మేరకు బుధవారం స్థానిక కళాశాలలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించడం గర్వ కారణంగా ఉందన్నారు. ఇందులో కె.సాయి సుదీక్ష 93.48 శాతం తో, డి పవన్‌తేజ్‌రెడ్డి 93.28శాతంతో, ఎస్.స్పందన 89.77శాతంతో, ఎ.వెంకట సాయిదీపక్ 88.20శాతంతో ఆలిండియా ర్యాంకులు సాధించారన్నారు. ఎంతో ఇష్టంగా, కష్టపడి చదివిన ఈ విద్యార్థులు పలువురికి స్ఫూర్తిగా నిలిచార న్నారు. వీరిని ఇంతటి స్థాయిలో తీర్చిదిద్దిన అధ్యాపకుల కృషి ఎంతో ఉంద న్నా రు. కళాశాల నుంచి మరింత మంది విద్యార్థులు ర్యాంకులు సాధిం చాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

రెవెన్యూ సమస్యలపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో నెల కొన్న రెవెన్యూ సమస్యలపై రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నది యాదేవి ఆరా తీశా రు. బుధ వారం వీరబల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేష్ తో సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై ఆరా తీసి, ఎన్ని పరిష్కారం అయాయని అడిగారు. రీసర్వేలో రైతులకు న్యాయం జరిగిందా. అనుభవంలో ఉన్నవారికి వారి భూములు దక్కాయా లేదా అని అడిగా రు. ఫ్రీహోల్డ్ భూముల వివరాలు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో డిటి వెంకటనారాయణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి

ఇ-పంట నమోదును పరిశీలించిన డిఎఒ

ప్రజాశక్తి-పీలేరు

మండలంలో రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలతకు సంబంధించి ఇ-పంట నమోదను ను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ పరిశీలిం చారు. మండలంలోని రేగళ్ళు, బాలంవారిపల్లి వి. శ్రీకాంత్ రెడ్డికి చెందిన పంట పొలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎఒ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ప్రతి పంటను ఆర్ఎస్‌కె సిబ్బంది ద్వారా ఇ-పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు విశిష్ట సంఖ్యను రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ గ్రామ సహాయకులు ద్వారా పొందాలని తెలిపారు. ఈ నెల 28 లోగా రైతులు విశిష్ట సంఖ్యను వ్యవసాయ గ్రామ సహాయకుల నుంచి పొందాలని తెలిపారు. భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు, చరవాణి తీసుకొని రైతు సేనా కేంద్రాలకు తీసుకెళ్లి తమకున్న భూమికి విశిష్ట సంఖ్యను పొందాలని తెలిపారు. ఈ నెంబరు ద్వారా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్న దాత సుఖీభవ, వివిధ సంక్షేమ పథకాలలో లబ్ది పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పీలేరు డివిజన్ వ్యవ సాయ సహాయ సంచలకులు వైవి రమణరావు, జిల్లా కార్యాలయం ఎపిఒ మోహన్, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, టిఎ కరుణాకర్ రెడ్డి, ఎఇఒలు జహీర్, జ్యోతి, మాజీ సర్పంచ్ సురేంద్ర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఇ-పంట నమోదును పరిశీలిస్తున్న చంద్రానాయక్



పెద్దూరు రోడ్డులో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని పెద్దూరు రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. వారం రోజుల క్రితం టెంపో వాహనం విద్యుత్తు స్తంభానికి ఢీకొనడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ రోడ్డుపై నిత్యం వాహనాలు, ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గాలివీడు నుంచి దాన రెడ్డిపల్లికి వెళ్లే ఆర్‌టిసి బస్సు, ప్రయివేట్ స్కూల్ వ్యాన్లు ఈరోడ్డు ద్వారానే వెళ్ళాలి రావడంతో విద్యుత్ స్తంభం ఓవైపు ఒరిగి ఉండటంతో భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వేరే వాటిని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కోళ్ల ఫారంపై విచారణ

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ దాసరివాండ్లపల్లిలో ఉన్న కోళ్ల ఫారంను తొలగించాలని ఆ గ్రామంలోని బిసి కాలనీకి చెందిన ప్రజలు మంగళవారం ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆ కోళ్ల ఫారం సమీపంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఉందని పిల్లలకు అస్వస్థకు గురవుతున్నారని ఎంపిడిఒ దృష్టికి తీస ుకెళ్ళారు. గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోరాన్‌చెరువ పంచాయతీ కార్యదర్శి సరోజాకు విచారించమని బుధవారం ఎంపిడిఒ ఆదేశించారు. స్థానిక వైద్యాధి కారి, పశువైద్యాధికారితో పిల్లలకు వైద్య పరీక్షలు చేయించిన తర్వాత వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలోని సర్పంచ్, వార్డు మెంబరు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామసభ తీర్మానం ద్వారా తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులు పంపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మృత్యువుతో పోరాడి ఓడిన కవిత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన కవిత మృత్యువుతో పోరాడి ఓడింది. కవిత మృతితో రోడ్డు ప్రమాదం బారిన పడి కుటుంబం అంతా మృత్యువాత పడటం తీవ్ర విషాదాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నివాసమున్న భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న సోమశేఖర్, కవిత దంపతులకు రెడ్డిశేఖర్(5) సిద్దేశ్వరి(3) ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత శనివారం కదిరిలో బంధువు అంత్యక్రియలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గ మధ్యంలోని ములకలచెరువు వద్ద టిప్పర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పిల్లలు ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సోమశేఖర్, కవిత లను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తం౦లించగా సోమశేఖర్ ఆస్పత్రిలో మృతి చెందాడు. కోమాలోకి చేరుకున్న కవితను తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందించినప్పటికీ మృత్యువుతో పోరాడి బుధవారం మృతి చెందింది. కుటుంబంలోని నలు గురు మృత్యు వాత పడ్డారు. దీంతో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆటోలకు పోలీసు నెంబర్ తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం : మండలంలో తిరుగుతున్న ఆటోలకు పోలీసు నెంబర్లు తప్పనిసరిగా ఉండాలని లక్కిరెడ్డిపల్లె సిఐ కొండారెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆటోలకు పిసి నెంబర్లు ఇచ్చారు. ఈ నెంబర్లు ఆటోపై తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. ఈ నెంబర్ వల్ల ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు తమ వస్తువులను ఆటోల మర్చిపోయిన ఆటోలకు ఏదైనా ఇబ్బందులు కలిగిన సరైన సమయంలో సమా చారం చేర డానికి ఆటోలను గుర్తించడానికి వీలుగా ఈ నెంబర్ ఉపయోగ పడు తుందని అన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలకడలో 'ఉపాధి' సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ : మండల కేంద్రమైన కలకడలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండలంలోఉపాధి హామీ పథకం సంబంధించి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేయుటకు గానూ సామాజిక తనిఖీ బృందం వచ్చినట్లు తెలిపారు. 13.02.2025 వ తేదీ నుంచి ఎస్ఆర్‌పి . నలుగురు డిఆర్‌పిల ఆధ్వర్యంలో 16 గ్రామ పంచాయతీలలో నిర్వహించినట్లు చెప్పారు. 2023-2024 సంవ త్సరంలో జరిగిన 486 పనులకు గానూ రూ.7.47 కోట్ల రూపా యలు ఖర్చు సంబంధించి ఆడిట్ చేయడం జరుగుతోందన్నారు. ఈ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశానికి మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరయ్యారు. ఎపిఒ చెన్నకేశవులు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పి సుబ్బారావు, డిఆర్‌పిలు కూడా హాజరు కావడం జరిగిందన్నారు.

గంగమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : మార్చి1, 2 తేదీల్లో జరిగే గంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని టిడిపి మండల నాయకులు మదన్‌మోహన్ పేర్కొన్నారు. తాగునీరు, క్యూలైన్లలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, జాతరకు వచ్చే భక్తులకు చలువ పందిళ్ళు, స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అంతరాయం లేకుండ చూడాలని తెలిపారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే జాతర ఏర్పాట్లు ప్రారంభమయ్యా యని గంగమ్మ గుడికి మరమ్మతులతో పాటు అమ్మవారి ఆలయానికి పెయింటింగ్ కూడా వేయడం జరుగుతుందన్నారు. జాతర ప్రారంభమైయే సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర జరిగేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమ నిర్మాణాలు

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ శివారుల్లో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ వాటిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 72/2లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అత్యంత ఖరీదైన ప్రాంతమైన సర్వే నెంబరు 72/2లో సుమారు 2.50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని గతంలో ఒకరికి కట్టబెట్టారన్న నిర్ధారణతో అప్పటి తహశీల్దార్ ఖాదర్ షరీఫ్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడం జరిగింది. అనంతరం ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా మిన్నకుండిన భూ ఆక్రమణ దారులు ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు కొందరు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. జెసి ఆదేశాలతో సోమవారం స్థానిక రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణ పనులను ఆపాలని హెచ్చరించారు. అయినా నిర్మాణ పనులు కొనసాగిస్తుండడంపై స్థానికంగా పలు విమర్శలు వస్తున్నాయి. తహ శీల్దార్ భీమేశ్వర్రావు వివరణ ఇస్తూ ఆ స్థలంపై విచారణ నిర్వహించి, అందుకు సంబంధించిన నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు.

'ఉపాధి' పనులు గుర్తించండి

ప్రజాశక్తి-గాలివీడు

వేసవి కాలం వస్తున్నది ఉపాధి పనులను గుర్తించి వేసవిలో ఉపాధి కూలీల సంఖ్యను కూడా పెంచాలని ఎంపిడిఒ జవహర్‌బాబు పేర్కొ న్నారు. బుధవారం ఎంపిడిఒ సభా భవనంలో ఎపిఒలు, ఇసి, టిఎలు, ఎఫ్ఎ, లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డ్ కలిగిన ప్రతి వ్యక్తికి ఉపాధి కూలీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉందని పేర్కొన్నారు. పని అయిన వెంటనే బిల్లును కూడా ఆల స్యం లేకుండా సకాలంలో రావడానికి టెక్నికల్ అసిస్టెంట్ కూడా చొరవ చూ పాలని చెప్పారు. 17 గ్రామాలలో లోని ఉపాధి కూలీలందరికీ ఉపాధి పని కల్పించడానికి ఉపాధి సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒలు రామచంద్రయ్య, హరిప్రసాద్, ఇసి బాలాజీ, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సుగుణ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో బుధవారం సైబర్ నేరాల గురించి పొదుపు మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. రిజర్వు బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల గురించి డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఫోన్‌లో వ్యక్తిగత సమాచారాలు, ఒటిపిలు షేర్ చేయవద్దని సూచించారు. కెనరా బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లావాదేవీలు, పొదుపు నిర్వహణ, డిజిటల్ లావాదేవీలకు సంబంధించి వచ్చే లింక్స్ పట్ల జాగ్రత్త వహించాలన్నారు. హెర్డ్స్ సంస్థ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు తమ సంస్థ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన వాహనం, దుంగలు, నిందితుడితో నిఘా విభాగం బృందం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీశాఖ సంచార దళ నిఘా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు డిఎఫ్ఒ గురు ప్రభాకర్ తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు తాను తమ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించా మన్నారు. ఆ సమయంలో పీలేరు వైపు నుంచి ఓ కారు వేగంగా ముందుకు దూసుకువెళ్లిందని చెప్పారు. అప్రమత్తమైన తమ సిబ్బంది ఆ కారును వెంబడించి చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, అశోక్ నగర్ సమీ పంలో పట్టుకునే ప్రయత్నం చేశారన్నారు. ఆ సమయంలో కారులోని ఐదుగురిలో నలుగురు చీకట్లో పారిపోగా వెంగటేశన్ పప్పగన్ (41) అనే తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి పట్టుబడ్డాడని అన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 301 కేజీ బరువుగల 9 ఎర్రచందనం దుంగలు గుర్తించామన్నారు. కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని అంచనా వేశామని చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఒ చంద్రశేఖర్, ఎఫ్‌బిఒ లు ప్రతాప్, కుప్పుస్వామి, ప్రొటెక్షన్ కూడా వాచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె రూరల్ మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని చిప్పిలికి చెందిన చల్లా తిప్పన్న(65) షేర్ ఆటోలో చెంబకూరు రోడ్డులోని బొమ్మనచెరువుకు బయల్దేరాడు. మార్గ మధ్యంలో కొత్తపల్లి గ్రామ సమీ పంలోని హంద్రీనీవా కాలువ వద్ద ప్రమాదవశాత్తు వేగంగా వెళుతున్న ఆటో లోనుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ గాయత్రీదేవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి-వేంపల్లి రహదారిలోని కుమ్మరపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని శ్రీనివాసులు, జహీరిన్ అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయినట్టు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. శ్రీనివాసులు, జహీరిన్ ఇంటి వద్ద నుంచి పొలంలో ఉలవలు కోసేందుకు పొలం వద్దకు బైక్‌లో వెళుతుండగా మార్గమధ్యంలో కుమ్మరపల్లి సమీపంలోకి లక్కిరెడ్డిపల్లి నుంచి రాయచోటి వైపు వెళుతున్న ద్విచక్ర వాహన దారుడు వీరిని ఢీకొని వెళ్లిపోయాడని తెలిపారు. సంఘటనలో శ్రీనివాసులకు కాలు విరగగా, జహీరిన్‌కు తీవ్ర గాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.